లోపలికి చూశాడు. రాధ ఇంకా స్నానం చేస్తోనే ఉంది. సిగరెట్ వెలిగించి తృప్తిగా కళ్లు మూసుకున్నాడు సుందరం. పది రోజులైంది. అమ్మ దగ్గర సిగరెట్ కాల్చడానికి కుదరదు. డబ్బు తగలేస్తున్నాడని తిడుతుంది.

సిగరెట్ వీలైనంత వరకూ కాల్చి చెయ్యి కాలబోయే ముందు అవతలపడేసి, కుర్చీలో కూర్చున్నాడు. మరో అరగంట తరవాత వొచ్చింది రాధ. తల రుద్దు కొని, శుభ్రమైన బట్టలు వేసుకుని ఉంది. కడిగిన ముత్యం అంటారు– ఇలాటి వాళ్లనే అనుకుని, సుందరం, "చాలా సేపు చేశావే" అన్నాడు.

"ఆ రైలు ధూళి ఒక పట్టాన వదలదుగా! సగం సబ్బు అరిగినా, ఇంకా ఒళ్లు శుభ్రపడినట్టే లేదు" అంది రాధ మరో కుర్చీలో కూర్చుంటూ తడితడిగా ఉన్న తల వొదులుగా ఆమె భుజాలమీంచి పడుతోంది. గాజులు కూడా లేని చేతులు ఎంతో సుకుమారంగా ఉన్నాయి. చాలా సేపు ఆమెని చూస్తూ ఉండి పోయాడు సుందరం.

"ఏమిటలాగ చూస్తున్నారు!" అంది రాధ.

"నిన్ను"

"ఎందుకని?"

"నిన్ను చూడ్డానికి రెండు కళ్లు చాలేవన్నారు– అందుకు ఎన్ని కళ్లైనా చాలవు– ఎంతసేపైనా చాలదు. అందుకని"

రాధ చిన్న నవ్వు నవ్వి ఊరుకుంది. అత ననుకున్నంతగా ఆపొగడ్త ఆమెని సంతోషపెట్టలేదు.

నాలుగైదు నిమిషాల తరవాత, "ఇందాకటినించీ ఈ వాసన ఏమిటి?" అంది రాధ.

"ఏ వాసన!"

"సిగరెట్‌లాగ. మీరు కాల్చరుగా?"

"అదా?– ఎప్పుడైనా కాలుస్తూ ఉంటాను."

"ఇప్పుడు కాల్చేరా?"

"అవును."

చిత్రంగా అతనివొంక ఒకసారి చూసి తల తిప్పుకుంది రాధ. ఆమెకి సిగరెట్ వాసన చాలా అసహ్యం. కాని, అది ఎలాగ అతనికి చెప్పాలో ఆమెకి తెలీ లేదు. అవసరం లేకుండా అతన్ని నొప్పించడం ఆమెకి ఇష్టమూలేదు.

మనిషి మీల్స్ కేరియర్ తెచ్చి ఇచ్చి వెళ్ళబోయాడు.

మధ్యాహ్నం రెండవుతోంది. పుస్తకం చదువుతూ నిద్రపోతోంది రాధ. కళ్లు నులుముకుంటూ వెళ్లి తలుపు తీసింది. భూషణ్‌ని చూసి ఆశ్చర్యపడింది.

"అంత ఆశ్చర్యంగా చూస్తావేం రాధా! ఎప్పుడో రావలసింది, పనులు ఎక్కువైపోయాయి—రాబడి తగ్గిపోయింది" అంటూ లోపలికివొచ్చి కూర్చున్నాడు. రాధ ముఖం కడుక్కొని వొచ్చింది.

"మొన్న బజారులో కనిపించావు, పలుకరిద్దామనుకున్నాను. కాని నాతో ఇద్దరు ప్రౌఢ్యూసర్లు ఉండడాన్న ఎందుకులే అని ఊరుకున్నాను. అయినా వాళ్లు ఊరుకోలేదనుకో! వాళ్లేమన్నారో తెలుసా?"

"ఏమంటే ఏంలే బాబాయ్! పిన్ని బాగుందా?"

"బాబాయ్ అంటావేమిటి రాధా ఎన్నిమార్లు చెప్పినా? మామయ్యా అని పిలూ. మీ నాన్న కాదన్నాడు గానీ కుమార్‌కి నిన్ను చేసుకుందామనుకున్నాను"

అదంతా ఎప్పటి కథలే! అయినా, నిన్ను బాబాయ్ అని పిలవాలనిపిస్తుంది. సీత పిన్ని ఎలాగ ఉంది?" అంది రాధ

"బాగానే ఉంది. నిన్నొకసారి పిల్చుకు రమ్మంది. చాలా సార్లు చెప్పిందిలే. కాని, కొత్తకాపురం—పానకంలో పుడకలాగా ఎందుకులే అని నేను ఊరుకున్నా. ఆవిడ ఊరుకోలేదు. అది సరేగానీ, అలా చిక్కిపోయావేం? నీళ్లు నీ అరోగ్యానికి పడలేదా?" అన్నాడు తాపీగా చుట్ట వెలిగిస్తూ భూషణం.

"నేను బాగానే ఉన్నాను,"

"అది నిజమేలే. నువ్వెప్పుడూ బాగానే ఉంటావు. మీ అమ్మ అందం అంతా నీకు వొచ్చింది. దానికి వడ్డీమీద వడ్డీ వొస్తున్నట్టు అది రోజురోజుకీ ఎక్కువౌతోంది!" అంటూ వొంకరగా ఒక చిటనవ్వు నవ్వేడు భూషణం. అతని మనసులోని నలుపంతా ఆ ముఖంలోనూ కళ్లలోనూ ప్రస్ఫుటం అయ్యేలాగ నవ్వేడు.

"వావో. టీ తెస్తాను" అని లేచింది రాధ.

"నేను టీ తాగనుగా! కాఫీ ఇయ్యి" అన్నాడు భూషణం.

"సరే" అని రాధ లోపలికి వెళ్లింది. ఉన్న కొంచెం గుండతో కాఫీ చేసి తెచ్చింది. తాగి, మెచ్చుకుని, "గొప్పగా ఉంది. నువ్వు తెచ్చుకోలేదేం?" అన్నాడు భూషణం.

"సాయంత్రం తాగుతానులే. ఈ టైములో నా కలవాటు లేదు" అంది రాధ. నవ్వి, "పెళ్లి అయ్యాక చాలా మారిపోయావు రాధా!— నీ కాఫీ అలవాటు

